# నమస్తే తెలంగాణ
# హనుమకొండ
5 | ఆదివారం 16 జూన్ 2024 | HANUMAKONDA


## వరంగల్ ఇన్‌చార్జి సీపీగా అభిషేక్ మహంతి



సుబేదారి, జూన్ 15 : వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా శిక్షణకు వెళ్లిన నేపథ్యంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి ఇన్‌చార్జి సీపీగా వ్యవహరిస్తున్నారు. వారం రోజుల పాటు అంబర్ కిషోర్‌ఝా శాఖాపరమైన శిక్షణ తీసుకోనున్న క్రమంలో అభిషేక్ మహంతికి ఇన్‌చార్జి సీపీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.



మైలారం గ్రామ సభలో కార్యదర్శి విజేందర్‌తో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

ఐఏఎస్‌ల రాష్ట్రవ్యాప్త బదిలీల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలో నలుగురు కలెక్టర్లకు స్థానచలనం కలిగింది. హనుమకొండకు వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్‌కు సత్యశారదాదేవి, ములుగుకు దివాకర, జయశంకర్ భూపాలపల్లికి రాహుల్ శర్మను నియమిస్తూ సీఎస్ శాంతికుమారి శనివారం ఉత్తర్వులిచ్చారు. హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్‌ను నారాయణపేటకు బదిలీ చేయగా ములుగు, భూపాలపల్లి కలెక్టర్లు ఇలా త్రిపాఠి, భవేశ్‌మిశ్రాకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.

*- ములుగు, జూన్15 (నమస్తే తెలంగాణ)/హనుమకొండ/ ఖిలా వరంగల్ /భూపాలపల్లి రూరల్*

# నాలుగు జిల్లాలకు కొత్త కలెక్టర్లు



ప్రావీణ్య, హనుమకొండ



సత్యశారదాదేవి, వరంగల్



రాహుల్‌శర్మ, భూపాలపల్లి



టీఎస్ దివాకర, ములుగు

**హనుమకొండకు ప్రావీణ్య, నారాయణపేటకు సిక్తా పట్నాయక్ బదిలీ**

**వరంగల్‌కు సత్యశారదాదేవి, ములుగుకు దివాకర**

**జయశంకర్ భూపాలపల్లికి రాహుల్‌శర్మ**

**ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ శాంతికుమారి**

ఉమ్మడి వరంగల్‌లోని హనుమకొండ, వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ కలెక్టర్‌గా ఇందులో భాగంగా వ్యవసాయశాఖ, సహకార శాఖ జాయింట్ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్న సత్య శారదాదేవి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న పీ ప్రావీణ్యను హనుమకొండకు బదిలీ చేశారు. ఆమె మార్చి 13, 2023న వరంగల్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా విధులు నిర్వర్తించారు. ప్రస్తుత కలెక్టర్ సిక్తా పట్నాయక్ నారాయణపేట కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆమె 2023 ఫిబ్రవరి 1న హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి జిల్లా అభివృద్ధికి కృషి చేశారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించారు. ములుగుకు టీఎస్ దివాకర, భూపాలపల్లికి రాహుల్ శర్మ నియమితులయ్యారు. కాగా, 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన దివాకర జగిత్యాల జిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ములుగు కలెక్టర్ బదిలీ అయ్యారు. ఆయన గతంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుత కలెక్టర్ ఇలా త్రిపాఠిని బదిలీ చేయగా ఆమెకు ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. 2017 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన రాహుల్ శర్మ ప్రస్తుతం వికారాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా విధులు నిర్వర్తిస్తున్నారు. పదోన్నతిపై ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా పాలనాధికారిగా రానున్నారు. ప్రస్తుతం భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న భవేశ్‌మిశ్రా బదిలీపై వెళ్లనున్నారు.

# తాగునీటి గోస పట్టదా?

**రెండు నెలలుగా తండ్లాడుతున్నాం**

- మైలారం గ్రామసభలో మహిళల ఆగ్రహం
- జీపీ కార్యదర్శి నిలదీత, ప్రత్యేకాధికారి గైర్హాజర్‌పై మండిపాటు
- సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరిక

రాయపర్తి, జూన్ 15 : రెండు నెలలుగా తాగునీటి కోసం తండ్లాడుతున్నామని రాయపర్తి మండలం మైలారం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామ పంచాయతీ కార్యాయలంలో శనివారం నిర్వహించిన గ్రామసభలో ఉద్యోగులు, సిబ్బందిపై మండిపడ్డారు. సభ జరుగుతుండగా అక్కడికి పెద్ద సంఖ్యలో చేరుకున్న 2వ వార్డు మహిళలు, ప్రజలు తమ తాగునీటి సమస్యకు ఎవరు పరిష్కారం చూపుతారంటూ జీపీ కార్యదర్శి విజేందర్‌తో వాగ్వాదానికి దిగారు.

గత రెండు నెలలుగా తీవ్రమైన ఎండలతో ప్రజలంతా ఉక్కిరిబిక్కిరి అవుతుంటే తాము తాగేందుకు గుక్కెడు నీళ్లు రాక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ సరఫరా చేస్తున్న నీళ్లు తమ కాలనీకి రావడం లేదని, ఈ విషయమై జీపీలో ఎన్నిమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో కార్యదర్శిని చుట్టిముట్టిన మహిళలు గ్రామసభకు ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్న ఎంపీడీవో గుగులోత్ కిషన్‌నాయక్ ఎందుకు గైర్హాజర్ అయ్యారంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఏనాడు తాగునీటి కోసం ఇబ్బంది కాలేదని కేసీఆర్ సర్కార్, సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసినప్పటి నుంచి తమ గోస పట్టించుకునే వారే లేరని వాపోయారు. గ్రామంలోని మైలారం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సహకారంతో రాష్ట్రంలోని వరంగల్, మహబూబాబాద్, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలకు సాగునీళ్లు సరఫరా అవుతుండగా మైలారం గ్రామస్తులు మాత్రం గుక్కెడు నీళ్ల కోసం ఇబ్బందిపడాల్సిన దుస్థితి దాపురించిందని చెప్పారు. ఇప్పటికైనా సిబ్బంది, మండల అధికారులు స్పందించి తమ సమస్యకు పరిష్కారం చూపాలని, లేకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని తాళ్ల సందీప్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, రాంరెడ్డి, ధనలక్ష్మి, యమున, రాజేంద్ర, ఉత్తరమ్మ, పరుపాటి యమున, పద్మ, రజిత, బోయిని యాకమ్మ తదితరులు హెచ్చరించారు.

### సర్పంచ్‌లు లేక ఇష్టారాజ్యమైంది



కేసీఆర్ సర్కార్ పోవుడు, సర్పంచ్‌లు దిగిపోవడంతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బందికి ఇష్టారాజ్యం తయారైంది. వాళ్ల పనితీరును అడిగే వాళ్లే లేరు. ఫస్టునాడు జీతం తీసుకునుడు.. రోజుకో గంట సేపు కూసోని ముచ్చట్లు పెట్టుడుతోనే సరిపోతున్నది. ప్రజల సమస్యలను పరిష్కరించాలన్న సోయి కూడా ఉండడం లేదు. మా తాగునీటి సమస్యను పరిష్కరించకుంటే సక్కగా కలెక్టర్ కాడికి పోవుడు తప్పదు.

– ధనలక్ష్మి, మైలారం

### ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం



గ్రామంలోని రెండో వార్డుకు గ్రామ పంచాయతీ నీళ్లు సక్రమంగా సరఫరా కావడం లేదన్నది అందరికీ తెలిసిందే. సమస్య పరిష్కారానికి కాలనీవాసులు సహకరించడం లేదు. దీంతో తప్పని సరి పరిస్థితుల్లో మా వాటర్ ట్యాంకర్‌తో నీళ్లు సరఫరా చేయిస్తున్నాం. గ్రామ సభలో జరిగిన ఆందోళనను గ్రామ ప్రత్యేకాధికారి, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

– పెంచల విజేందర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి

# ఆరుగురు మావోయిస్టుల అరెస్ట్

- మందుపాతరలు అమర్చుతుండగా అదుపులోకి..
- డిప్యూటీ దళ కమాండర్, ఇద్దరు దళ సభ్యులు, ముగ్గురు మిలీషియా సభ్యుల రిమాండ్
- మందు గుండు సామగ్రి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ములుగు ఎస్పీ శబరీష్



అరెస్టయిన మావోయిస్టులతో పాటు స్వాధీనం చేసుకున్న మందు గుండు సామగ్రిని చూపుతున్న ఎస్పీ శబరీష్, పోలీస్ అధికారులు

ములుగు, జూన్ 15 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దులోని అటవీ ప్రాంతంలో మందు పాతర్లను అమర్చుతున్న ఆరుగురు మావోయిస్టులను ములుగు జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. ఈ నెల 13న వెంకటాపురం(నూగూరు) మండలం తడపాల అటవీ ప్రాంతంలో నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీ దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీకి చెందిన మావోయిస్టులు, మిలీషియా సభ్యులు కర్రె గుట్టలపై గెరిల్లా బేస్ ఏర్పాటు చేయడంలో భాగంగా ప్రజలు, పోలీసులను అటవీ ప్రాంతంలోకి రాకుండా ఉంచాలనే ఉద్దేశంతో కాలి బాటల వెంట మందు పాతర్లను అమర్చుతున్నారని సమాచారం వచ్చిందన్నారు. దీంతో పోలీసులు కూంబింగ్ చేస్తుండగా తడపాల గ్రామానికి వెళ్లే దారిలో మందు పాతర్లను అమర్చుతున్న మావోయిస్టులు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. ఈ క్రమంలో పోలీసులు ఇద్దరు మహిళలు, నలుగురు పురుషులను పట్టుకొని వారి వద్ద నుంచి ఒక డీబీబీఎల్ తుపాకీ, నాలుగు కిట్ బ్యాగులు, రెండు వాకీటాకీలతో పాటు పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిని విచారించగా ఇందులో వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీ డిప్యూటీ దళ కమాండర్ కారం బుద్రి అలియాస్ రీతాతో పాటు పామేడు ఏరియా కమిటీ సభ్యురాలు సోడి కోసి అలియాస్ మోతె, బెటాలియన్ సభ్యుడు సోడి విజయ్ అలియాస్ ఇడుమ, మిలీషియా సభ్యులు కుడం దస్రు, సోడి ఉర్ర, మడకం భీమాలుగా తేలిందన్నారు. కారం బుద్రి అలియాస్ రీతాపై మొత్తం 30 కేసులున్నాయని, అందులో మాడూరి భీమేశ్వర్‌రావు, కొరుస రమేశ్, ఇల్లందుల ఏసును హత్య చేసిన కేసులో నిందితులుగా ఉన్నారన్నారు. సోడి కోసి అలియాస్ మోతెపై ఆరు కేసులు ఉన్నాయని, సోడి విజయ్‌పై నాలుగు, కుడం దస్రు, సోడి ఉర్ర, మడకం భీమపై ఆరు చొప్పున కేసులున్నాయని తెలిపారు. సమావేశంలో ఏటూరునాగారం ఏఎస్పీ మహేష్ గీతే, డీఎస్పీ రవీందర్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# నీళ్ల కోసం ఖాళీ బిందెలతో నిరసన

**రోడ్డెక్కిన పందిపంపుల గ్రామస్తులు**



ఖాళీ బిందెలు, బకెట్లతో నిరసన తెలుపుతున్న పందిపంపుల గ్రామస్తులు

భూపాలపల్లి రూరల్, జూన్ 15 : తాగునీటి సమస్య తీర్చాలని భూపాలపల్లి మండలంలోని నందిగామ శివారు పందిపంపుల గ్రామస్తులు శనివారం ఖాళీ బిందెలు, బకెట్లతో నిసరన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 40 కుటుంబాలకు వారం రోజులుగా నీరు రావడం లేదని, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రెండు కిలోమీటర్ల దూరంలోని కాంపల్లి నుంచి తెచ్చుకుంటున్నామని అన్నారు. పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో మూడు బోర్లు వేసినప్పటికీ అందరికీ నీళ్లు అందడంలేదని, ఇప్పటి వరకు బోర్లకు సంబంధించిన బిల్లులు కూడా రాలేదన్నారు. తమకు వెంటనే ప్రభుత్వం మంచినీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

## నేడు సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఉదయం, మధ్యాహ్నం పరీక్ష నిర్వహణ
- కేంద్రాల వద్ద 144 సెక్షన్

హనుమకొండ, జూన్ 15 : సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పరీక్ష ఆదివారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు జరుగనుంది. ఉదయం పరీక్షకు 9 గంటల నుంచి, మధ్యాహ్నం పరీక్షకు 2 గంటల నుంచి కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతిస్తారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన 11 సెంటర్లలో 4,730 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్ష హాలులోకి మొబైల్ ఫోన్స్, స్మార్ట్‌వాచ్, కాలిక్యులేటర్ లాంటి ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ అనుమతించరు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడంతో పాటు ఆ ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్లను మూసివేస్తారు. కేంద్రాల వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మెడికల్ ఎమర్జెన్సీ సదుపాయాలు ఏర్పాటు చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం బస్సులను ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఇప్పటికే కలెక్టర్ ఆదేశించారు.

**జిల్లాలో 11 సెంటర్లు..**

జిల్లా కేంద్రంలో సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి 11 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాజీపేట సోమిడిలోని తాళ్ల పద్మావతి కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్, హనుమకొండ కిషన్‌పురలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ బ్లాక్ – ఏ, బీ, ఇంజినీరింగ్ బ్లాక్ (సెవన్ హిల్స్ దవాఖాన దగ్గర), వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ బాలికల కళాశాల, పెద్దపెండ్యాల వద్ద ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్, ములుగు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా ఉన్న శ్రీగాయత్రి డిగ్రీ అండ్ పీజీ కాలేజీ, సుబేదారిలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సబ్ సెంటర్–ఏ, బీ, హంటర్‌రోడ్డులోని న్యూ సైన్స్ డిగ్రీ కాలేజీ, మాస్టర్జీ డిగ్రీ అండ్ పీజీ కళాశాల, హనుమకొండ అడ్వకేట్స్ కాలనీ రోడ్డు నంబర్–1లోని ఎస్‌ఆర్ నేషనల్ హైస్కూల్స్‌లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

**కేంద్రాల వద్ద 144 సెక్షన్..**

సుబేదారి : సివిల్స్ పరీక్ష సందర్భంగా వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఇన్‌చార్జి సీపీ అభిషేక్ మహంతి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించొద్దని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి సీపీ హెచ్చరించారు.

# గ్రీన్ ఫీల్డ్ హైవేకు భూములివ్వం..

- భూపాలపల్లి కలెక్టర్‌కు తెగేసి చెప్పిన రైతులు
- సమీక్షా సమావేశంలోనే ఫ్లెక్సీలతో నిరసన
- అనంతరం జాతీయ రహదారిపై రాస్తారోకో



కలెక్టర్ ముందు బ్యానర్లు పట్టుకొని నిరసన తెలుపుతున్న రైతులు

భూపాలపల్లి రూరల్, జూన్ 15 : గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే కోసం తమ భూములు ఇచ్చేది లేదని టేకుమట్ల, చిట్యాల, మొగుళ్లపల్లి మండలాల రైతులు భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రాకు తెగేసి చెప్పారు. పంట భూములే తమకు జీవనాధారమని, తమను ఇబ్బంది పెట్టొద్దని అన్నారు. శనివారం ఆయా మండలాల రైతులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలోనే ఫ్లెక్సీలతో నిరసన తెలిపారు. అంతకు ముందు రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు నష్ట పరిహారం అందజేస్తామని తెలిపారు. అభివృద్ధికి రహదారుల ఏర్పాటు అత్యంత అవసరమని, భూ సేకరణ విషయంలో రైతుల సూచనలు, సలహాలు తీసుకొని నివేదికలు పంపినట్లు తెలిపారు. 350 ఎకరాలు, 35 కిలో మీటర్ల దూరం వరకు గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే వస్తుందని, రోడ్డు నిర్మాణం కోసం 45 మీటర్ల వెడల్పుతో భూ సేకరణ చేయాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా రైతులు తమ భూములను ఇవ్వబోమని చెప్పడంతో పాటు నిరసన తెలపడంతో కలెక్టర్ సమావేశం నుంచి వెళ్లిపోయారు. అనంతరం భూపాలపల్లి–పరకాల రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. ప్రధాని మోదీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఎట్టి పరిస్థితుల్లో జాతీయ రహదారి నిర్మాణానికి భూములు ఇచ్చేది లేదని ముక్త కంఠంతో రైతులు తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మంగీలాల్, నేషనల్ హైవే అధికారులు, మూడు మండలాల రైతులు పాల్గొన్నారు.

# జీడికల్ ఆలయానికి రూ.2లక్షలు

**ఏపీలోని కౌలు భూముల నుంచి సమీకరణ**



కొర్నెపాడు వేంకటేశ్వరాలయంలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

లింగాలఘనపురం, జూన్ 15 : జనగామ జిల్లా లింగాలఘనపురం మండలంలోని జీడికల్ సీతారామచంద్రస్వామి ఆలయానికి గుంటూరు జిల్లాలోని భూముల కౌలు ద్వారా రూ.2 లక్షల ఆదాయం సమకూరింది. దీనికి సంబంధించిన వివరాలను జీడికల్ ఆలయ ఈవో వంశీ శనివారం విలేకరులకు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడులోని సర్వే నంబర్ 302/1ఏ1లో 6.26 సెంట్లు, 302/ 1సీ1లో 5.33 సెంట్ల భూమి సీతారామచంద్రస్వామి ఆలయానికి ఉంది.. వీటి కౌలుకు సంబంధించి కొర్నెపాడులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వేలం నిర్వహించారు. 6.26 సెంట్ల భూమికి రూ.1,07,800కు మార్కండేయ, అలాగే 5.33 సెంట్ల భూమిని రూ.92,000 లకు రవితేజ దక్కించుకున్నారు. ఈ భూములకు గతేడాది వేలం ద్వారా రూ.1.36 లక్షలు సమకూరాయని ఈవో వంశీ తెలిపారు.

## మొలకెత్తని మక్కజొన్న విత్తనాలు

- ప్రైవేట్ కంపెనీ నిర్వాకంతో రూ.25 వేల నష్టం
- వైరల్‌గా మారిన కౌలు రైతు వీడియో
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న బండారి శ్రీను

విత్తనాలు మొలకెత్తలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న కౌలు రైతు బండారి శ్రీను



ఐనవోలు, జూన్ 15 : తను సాగుచేస్తున్న వ్యవసాయ భూమిలో వేసిన మక్కజొన్న విత్తనాలు మొలకెత్తలేదని ఓ కౌలు రైతు ఆవేదనతో సోషల్ మీడియాలో పెట్టిన వీడియో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన రైతు బండారి శ్రీను ఓ ప్రైవేట్ కంపెనీకి చెందిన మూడు మక్కజొన్న విత్తనాల బస్తాలను మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ షాప్‌లో రూ. 4500కు కొనుగోలు చేసి వెంకటాపురం శివారులో 1.20 ఎకరాల భూమిలో విత్తాడు. 13 రోజులు గడిచిన తర్వాత సుమారు 10 శాతం విత్తనాలు ఐదు ఫీట్లకు ఒక మొక్క చొప్పున మొలకెత్తాయి. కంపెనీ నిర్వాకంతో ఇప్పటి వరకు పెట్టిన రూ.25,000 వరకు పెట్టుబడిని నష్ట పోయాడు. తన భూమిలోనే కాకుండా ఆ కంపెనీ విత్తనాలు చుట్టు పక్కల రైతు భూముల్లో కూడా మొలకెత్తలేదని, తనను ప్రభుత్వం ఆదుకోవాలంటూ ఆయన సోషల్ మీడియాలో వీడియో పెట్టాడు. ఈ విషయమై ఏవో అడుప కవితను వివరణ కోరగా తన దృష్టి వచ్చిందని, తాను సెలవులో ఉన్నట్లు తెలిపారు. అయినప్పటికీ సదరు రైతు వివరాలు కనుక్కొని ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదన్నారు. విత్తనాలు విక్రయించిన డీలర్‌ను రైతు వద్దకు పంపించానని చెప్పారు. వర్షాలు సమృద్ధిగా పడలేదని, భూమిలో తేమ శాతం తక్కువగా ఉండడంతో మొక్కలు మొలకెత్తలేదన్నారు. ముందుగా విత్తనాలు వేసిన భూమికి నీరు పెట్టాలని సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. సరిపడా నీళ్లు పెట్టిన మూడు, నాలుగు రోజుల తర్వాత కూడా విత్తనాలు మొలకెత్తకపోతే సదరు విత్తనాల నమూనాను ల్యాబ్‌లో పరీక్షించి, వచ్చిన రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఏవో తెలిపారు.